క్లుప్తంగా

పార్టీని బలోపేతం చేస్తా



మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలసిన కూనాటి రమణయ్య యాదవ్

ఏర్పేడు: మండలంలో వైఎస్సార్ సీపీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కషి చేస్తానని పార్టీ మండల అధ్యక్షులు కూనాటి రమణయ్య యాదవ్ అన్నారు. ఆయన సోమవారం తిరుపతిలో జరిగిన సమావేశంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని కలసి పరిచయం చేసుకున్నారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఉన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం లెక్కింపు రేపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయాన్ని బుధవారం ఉదయం 7గంటల నుంచి లెక్కించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ఆదాయాన్ని ఆలయ ప్రాంగణంలోని కోట్లు మండపం వద్ద లెక్కించనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

యోగా శిక్షణ ఉపయోగకరం



యోగా శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరత్నమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ స్పష్టం చేశారు. సోమవారం బుచ్చినాయుడుకండ్రిగలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో యోగాపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు యోగా సాధనతో బహుళ ప్రయోజనాలు చేకూరతాయని, మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. రోగ నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. ప్రతి పౌరుడు యోగాను రోజు వారీ జీవితంలో భాగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

చిరు జల్లులకే జలమయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి వెళ్లే ప్రధాన మార్గం సోమవారం కురిసిన చిన్నపాటి వర్షానికే జలమయమైంది. రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. జల వినాయకుని సమీపంలో ఆలయం ముందే చెరువులా మారుతోంది. ఆలయ ఇంజనీరింగ్ అధికారులు పలుమార్లు మరమ్మతులు చేసినా ఫలితం లేకపోవడం గమనార్హం.

మోస్తరు వర్షం



బుచ్చినాయుడుకండ్రిగలో నిలిచిన వర్షపు నీరు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని వర్షం కురవడంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు. నిమ్మ రైతులు సంతోషం వ్యక్తం చేయగా, మిరప, మామిడి పంటల రైతులు ఇబ్బందులు పడ్డారు. ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు చల్లని గాలులతో ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా అమావాస్య ఉత్సవం



ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అమావాస్య ఉత్సవం ఘనంగా జరిగింది. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించారు. మేళతాళాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి అమ్మవార్లు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ముక్కంటి క్షేత్రం.. ఫ్లెక్సీల రణం

- మాడవీధుల్లో విచ్చలవిడిగా రాజకీయ ఫ్లెక్సీలు
- పట్టించుకోని అధికారులు



శ్రీకాళహస్తి పట్టణంలోని మాడ వీధిలో ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీ

శ్రీకాళహస్తి: ముక్కంటి క్షేత్రం కూటమి పార్టీల ఫ్లెక్సీల రణరంగంగా మారింది. స్వామి అమ్మవార్లకు మాడవీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తున్నందున నాలుగు మాడవీధులను ఎంతో పవిత్రంగా భావిస్తారు. అయితే రాజకీయ నాయకుల ఫ్లెక్సీలతో మాడవీధులు నిండిపోయి పవిత్రతను కోల్పోతున్నాయి. రాధారెడ్డి పురపాలక సంఘం చైర్మన్‌గా ఉన్న సమయంలో 2016లో నాలుగు మాడవీధుల్లో ఎవరూ రాజకీయ ఫ్లెక్సీలు కట్టకూడదని నాలుగు మాడవీధులను పవిత్రంగా ఉంచుకోవాలని కౌన్సిలర్లు తీర్మానించి అమలు చేయాలని ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలోనే అప్పట్లో బీజేపీ నాయకులు నాలుగు మాడ వీధుల్లో ఫ్లెక్సీలు కడితే తొలగించడంపై తీవ్ర దుమారం రేగింది. గత ఐదేళ్లలో కొందరు రాజకీయ నాయకులు ఫ్లెక్సీలు కట్టడం దానిపై విమర్శలు వచ్చాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నాలుగు మాడవీధుల్లో దేవుని చిత్రాలకంటే అప్పటి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఫొటోలు కనిపిస్తున్నాయని అప్పట్లో గగ్గోలు పెట్టారు. దీనిపై టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య భారీ ఎత్తున గొడవ జరిగి బాహాబామీకి దిగే పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి ఆ ఫ్లెక్సీలను తొలగించారు. గత నెల 28వ తేదీ జనసేన నాయకురాలు కోట వినుత జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పురపాలకసంఘ అధికారులు తొలగించారు.

జనసేన, టీడీపీ ఫ్లెక్సీల రగడ

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పురపాలక సంఘం అధికారులు తొలగించడంతో జనసేన నాయకురాలు తమ ఫ్లెక్సీలు ఎందుకు తొలగించారని, వెంటనే టీడీపీ ఫ్లెక్సీలను తొలగించాలని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద రోడ్డుపై బైటాయించి నిరసనకు దిగారు. ఇదే నేపథ్యంలో తమ ఫ్లెక్సీలు తొలగించిన వినుత హోర్డింగ్ ఉండకూడదంటూ రామసేతు వంతెన వద్ద ఉన్న టీడీపీ నాయకులు పురపాలకసంఘ అధికారులతో కలిసి తీయించారు. అనంతరం జనసేన తీయించిన టీడీపీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి, ఆ పార్టీ పంతం నెగ్గించుకుంది. ఈ విషయాన్ని బట్టబయలు చేయడానికి ఫొటోలు తీసని జర్నలిస్టుపై టీడీపీ నాయకులు దాడులకు దిగిన ఘటన రాష్ట్రం మొత్తం చూసింది.



టీడీపీ ఫ్లెక్సీలను తొలగించాలని నిరసన తెలుపుతున్న జనసైనికులు

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలకు అనుమతి లేదు

మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా మే 15న పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి కావాలని చలానా కట్టేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులకు పురపాలక సంఘం అధికారులు తిరస్కరించారు. పోలీసులు అనుమతి ఇవ్వద్దంటూ చెప్పడంతో కమిషనర్ నిరాకరించారు. వివాదాల నేపథ్యంలో ఫ్లెక్సీలకు అనుమతి లేదని చెప్పారు. దీంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.

వైఎస్సార్ విగ్రహానికి ఫ్లెక్సీలు కట్టి..

వైఎస్సార్ విగ్రహం చుట్టూ టీడీపీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వైఎస్సార్ సీపీ నాయకులను రెచ్చగొడుతున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం కనపడకుండా చేయాలని ఆయన విగ్రహానికి అడ్డంగా బొజ్జల సుధీర్ రెడ్డి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గొడవకు వస్తే వారిపై కేసులు పెట్టాలని ఇప్పటికే ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఇలా చేయడం గమనార్హం.

అపుడు పాపం.. ఇపుడు పుణ్యం

గతంలో నాలుగు మాడవీధుల్లో వైఎస్సార్‌సీపీ పోస్టర్లు పెడితే పాపం అని శివయ్య క్షమించడు అని బీరాలు పలికిన టీడీపీ నాయకులు ప్రస్తుతం నాలుగు మాడవీధుల్లో ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. స్వామివారి కల్యాణం పెండ్లి మండపం, ఆలయానికి భిక్షాల గాలిగోపురానికి ముందు ఉన్న వాహన మండపానికి సైతం ఫ్లెక్సీలను కట్టి తమను ఎవరూ ఏమి చేయలేరంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

వ్యాపారుల ఫ్లెక్సీలు సైతం కబ్జా

శ్రీకాళహస్తి పురపాలక సంఘానికి డబ్బులు కట్టి ఏర్పాటు చేసిన వ్యాపార ఫ్లెక్సీలను సైతం టీడీపీ నాయకులు తమ ప్రచార ఆర్భాటానికి వాడేసుకుంటున్నారు. వంతెన, ఉన్నత పాఠశాల ఉన్న కొన్ని వ్యాపార ఫ్లెక్సీలపై టీడీపీ ఫ్లెక్సీలు వేయడంతో వారు బయటకు చెప్పుకోలేక బాధపడుతున్నారు. వ్యాపారుల ఫ్లెక్సీలను సైతం ఎక్కడికక్కడ తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు టీడీపీ నాయకుల ఫ్లెక్సీలను తీయకపోవడంతో వారిపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

పట్టించుకోని అధికారులు

పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ అధికారులు టీడీపీకి తొత్తులుగా మారి పట్టణంలో ఇతరుల ఫ్లెక్సీలు పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వడంలేదు. పొరబాటును ఎవరైనా ఏర్పాటు చేస్తే వాటిని తొలగించి టీడీపీ నాయకులు మెప్పు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. కూటమిలో ఉన్న జనసేన ఫ్లెక్సీలను సైతం పీకిపారేస్తున్నారు.

ఆక్రమణ భూముల్లో బోర్డుల ఏర్పాటు



కబ్జా భూమిలో ఏర్పాటు చేసిన బోర్డు

తొట్టంబేడు: మండలంలోని బీడీ కాలనీ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను రాత్రికి రాత్రే కబ్జా చేస్తున్నారు. పత్రికల్లో కథనాలు వస్తే తప్ప రెవెన్యూ అధికారులు అటువైపు చూడటంలేదు. దీని వల్ల రెవెన్యూ వారి అండదండలతోనే ఈ కబ్జాలు సాగుతున్నట్లు చర్చ మొదలైంది. రెవెన్యూ అధికారులను వివరణ అడిగితే తమకు తెలియదని చెప్పడం, ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడం విడ్డూరంగా ఉంది. రోడ్డు పక్కన ప్రభుత్వ భూమి చదును చేస్తుంటే అధికారులకు తెలియకపోవడం ఏమిటో అని స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎట్టకేలకు ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో రెవెన్యూ సిబ్బంది బోర్డులు ఏర్పాటు చేశారు.

సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ



రేణిగుంట బస్టాండ్‌లో తిరంగా ర్యాలీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

రేణిగుంట: భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం సందర్భంగా పట్టణంలో సోమవారం సాయంత్రం రాష్ట్ర వన్నె కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ జీ పాలెం తేజోవతి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, బి ఎం ఎస్ రాష్ట్ర కార్యదర్శి సీనప్ప, అడ్వకేట్ ఉదయ్ కుమార్ రెడ్డి, కొరియర్ రవి, సూరి, వి ఆర్ రావణ, కృష్ణారెడ్డి, కరుణాకర్ రెడ్డి, పవన్ సింగ్, రేణిగుంట ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బి కల్వర్టు పూడ్చివేత



ప్రధాన కాలువలో కల్వర్టు వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు



మురుగు ప్రవాహానికి వీలులేకుండా మట్టితో పూడ్చి వేసిన ఆర్‌అండ్‌బి కల్వర్టు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి గ్రామంలో ఎన్నో ఏళ్లుగా మురుగునీరు, గుట్టపై నుంచి వచ్చే వర్షపు నీరు వెళ్లే ప్రధాన కాలువకు సంబంధించిన ఆర్‌అండ్‌బి కల్వర్టు కింద భాగాన్ని అధికార పార్టీ నాయకుల అండదండలతో ప్రైవేట్ వ్యక్తులు పూడ్చి వేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులు రోడ్డు నిర్మాణం చేసినప్పుడే కాలువ కోసం కల్వర్టును నిర్మించారు. ప్రస్తుతం కొందరు వ్యక్తులు అధికార పార్టీ నాయకుల అండదండలతో కల్వర్టు కింద భాగం తమ పట్టా భూమి అంటూ పూడ్చి వేశారు. ప్రస్తుతం మురుగునీరు కల్వర్టు కిందకు వెళ్లే పరిస్థితి లేదు. ఈ సమస్యపై గతంలోనే స్థానికులు కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. కానీ అధికార పార్టీ నాయకులు అడ్డుపడుతుండడంతో ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదు. ప్రధాన కాలువలో మురుగునీరు నిండిపోవడంతో దోమలు పెరిగిపోయాయని చెబుతన్నారు. దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సేవలు వినియోగించుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన ప్రత్యేక ఆధార్ నమోదు సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. ఆమె సోమవారం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో చేపట్టిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ నమోదు కేంద్రంలో చిన్న పిల్లల ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్, చిరునామా, సెల్‌ఫోన్ నెంబర్ల మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఖురాన్‌పై శిక్షణ తరగతులు



శిక్షణలో బోధిస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బహదూరుపేటలో ఉన్న మసీద్ ఏ ముహమ్మదీయలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు విద్యార్థులకు 'ఖురాన్'పై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జమాఅతె ఇస్లామీ హింద్, యస్ఐఓ బాధ్యులు షేక్ ముహమ్మద్, షేక్ అమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

వరదయ్యపాళెం: మండలంలో వివిధ ఇబ్బందులతో ఉన్న పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థికసాయం అందజేసినట్లు రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ శ్రీరామనేని పవన్‌కుమార్ తెలిపారు. ఆ మేరకు సోమవారం వరదయ్యపాళెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలానికి చెందిన మదనంబేడు విక్రమ్, చెల్లమ్మ, దీనదయాళ్, బీఎన్‌కండ్రిగ మండలంకు చెందిన గురునాథంకు చెక్కులను అందజేశారు.

శవాన్ని చూసినా భయమేనా?

శ్రీకాళహస్తి: సీపీఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు శవాన్ని చూసి కూడా ప్రభుత్వాలు భయపడుతున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జనమాల గురవయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారి దేహాలను బంధువులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో మనుషులను చంపగలరేమో కానీ మావోయిస్టుల సిద్ధాంతాలను చంపలేరని పేర్కొన్నారు.

దుస్థితిలో పార్కింగ్ షెడ్





ఆరుబయట ఎండలో నిలబెట్టి ఉన్న 104 వాహనం, శిథిలావస్థకు చేరుకున్న పార్కింగ్ షెడ్డు

నాగలాపురం: ప్రజలకు నిత్యం సేవలందిస్తున్న 108, 104 అంబులెన్స్ వాహనాలు పెట్టుకోవడానికి నాగలాపురం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో గది లేదు. ఇంతక ముందు ఉన్న పార్కింగ్ షెడ్డు శిథిలావస్థకు చేరుకుపోయి పైకప్పు పెచ్చులూడి కూలి పోవడానికి సిద్ధంగా ఉంది. దీంతో ఈ రెండు వాహనాలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ దుస్థితికి చేరుకుంటున్నాయి. 108, 104 అంబులెన్స్ వాహనాలలో పనిచేసే సిబ్బంది ఉండడానికి కూడా గది లేకపోవడంతో వారి బాధలు వర్ణనాతీతం. 108, 104 వాహనాలు పెట్టుకోవడానికి ప్రభుత్వ ఆసుపత్రిలో గదులు లేక పోవడంతో చెట్ల కింద, ఆరు బయట ఎండలో పెట్టుకుంటున్నారు. వాహనాలను పెట్టుకోవడానికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గదిని ఏర్పాటు చేయాలని సిబ్బంది పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రి ఆవరణలో 108, 104 వాహనాలు పెట్టుకోవడానికి నూతన షెడ్డుని నిర్మించాలని 108, 104 సిబ్బంది కోరుతున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

వరదయ్యపాళెం: యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, ప్రతిఒక్కరూ రోజువారీ దైనందిన జీవితంలో యోగాను దినచర్యగా అలవాటు చేసుకోవాలని ఎంపీడీఓ ప్రసాద్ కోరారు. ప్రభుత్వం పిలుపు మేరకు మంగళవారం నుండి గ్రామ సచివాలయాల వద్ద యోగాంధ్ర ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఈ నెల 31 వరకు యోగా శిక్షణ కొనసాగుతుందన్నారు. మండలంలో 13 సచివాలయాలను నాలుగు క్లస్టర్లుగా విభజించామని, వాటి పరిధిలో ఎంటటీలుగా తహశీల్దార్ సుధీర్ రెడ్డి, ఎంఈఓ సరస్వతి, ఈఓఆర్డీ చిరంజీవి, ఎంపీడీఓ పర్యవేక్షకులుగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. క్లస్టర్ పరిధిలో 75 మందికి మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ ఇస్తారని ఆయన పేర్కొన్నారు.

భూములకు పట్టాలివ్వాలని దళితుల నిరసన



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ: కుక్కంబాకం గ్రామంలోని దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో దళితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు దాసరి జనార్దన్ మాట్లాడుతూ మండలంలోని కుక్కంబాకం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 81 సర్వే నెంబరులోని 80 ఎకరాల 80 సెంట్లు ప్రభుత్వ భూమిని 20 సంవత్సరాలుగా దళితులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని పలుమార్లు రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి పట్టాలు ఇవ్వకపోతే జిల్లా కలెక్టరు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు గంధం మణి, నలుగూరి రమణయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నవారిపాళెంలో తొలగిన మురుగు

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: మండలంలోని వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ పరిధిని చెన్నవారిపాళెం దళితవాడలో ఎట్టకేలకు రోడ్ల వెంబడి నిలిచిన మురికి కూపాన్ని పంచాయతీ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది చొరవతో తొలగించారు. సోమవారం మురికి కూపంలో చెన్నవారిపాళెం దళితవాడ అన్న కథనం సాక్షి దిన పత్రికలో ప్రచురితమైంది. దీనిపై ఎంపీడీఓ ప్రసాద్, ఈఓపీఆర్డీ చిరంజీవి స్పందించారు. సంబంధిత పంచాయతీ సిబ్బందికి వైద్యఆరోగ్య శాఖ సిబ్బందికి సూచనలు జారీ చేస్తూ తక్షణమే మురుగునీటి నిల్వలను తొలగించాలని ఆదేశించారు. సోమవారం వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ ఈఓ బసిరెడ్డి ఆధ్వర్యంలో మురుగునీటి నిల్వలు చేరిన చెన్నవారిపాళెం దళితవాడలోని కాలువలను పారిశుధ్య సిబ్బంది తొలగించారు. పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. వీధులు, కాలువల్లో బ్లీచింగ్ చల్లించారు. వైద్యశాఖకు చెందిన ఎంపీహెచ్ఈఓ మధు, ఏఎన్ఎం శాంతకుమారి ఆధ్వర్యంలో సిబ్బంది ద్వారా దోమల నివారణకు క్రిమిసంహారక మందులను పిచికారీ చేశారు.



కాలువలోని పిచ్చిమొక్కలను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది



కాలువల్లో పూడికతీత పనులు



చెన్నవారిపాళెం దళితవాడలో పారిశుధ్య పనులు